# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 13-06-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **గుజరాత్ లోని అహ్మదాబాద్ లో ఎయిరిండియా విమానం ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ రోజు పరిశీలించారు.**
2. **అధిక దిగుబడులు సాధించే సరికొత్త వంగడాలను సృష్టించాలని రాష్ట్ర వ్యవసాయ మంత్రి కె.అచ్చెన్నాయుడు శాస్త్రవేత్తలను కోరారు.**
3. **రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.**
4. **కర్ణాటకలోని హొస్కోటె వద్ద జరిగిన రహదారి ప్రమాదంలో రాష్ట్రానికి చెందిన ఆరుగురు మృతి చెందారు.**

==========================

గుజరాత్ లోని అహ్మదాబాద్ లో ఎయిరిండియా విమానం ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు పరిశీలించారు. ఇందులో భాగంగా ఘటనాస్థలంలో పరిస్థితిని, ప్రమాద వివరాలను కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడి నుంచి అహ్మదాబాద్ సివిల్ ఆసుపత్రికి చేరుకున్నారు. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన ఏకైక విమాన ప్రయాణికుడు విశ్వాస్ కుమార్‌ను ప్రధానమంత్రి పరామర్శించారు. ప్రమాదంలో గాయపడిన ఇతర వైద్య విద్యార్థులతోనూ మాట్లాడారు.

కాగా అహ్మదాబాద్ నుండి లండన్‌కు వెళ్తున్న విమానం సాంకేతిక లోపంతో బి జె వైద్య కళాశాల సమీపంలో నిన్న కూలిపోయింది. దీంతో విమానంలో ఉన్న 241 మంది మరణించారు.

ఈ సందర్భంగా ప్రధానమంత్రి సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఈ విషాద సమయంలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.

--------------------------

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర-2025 పేరుతో నెలరోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఏలూరు, తిరుపతి జిల్లాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్లు, స్థానిక అధికారులు, ప్రజలు పాల్గొని యోగాసనాలు వేశారు.

కాగా... అంతర్జాతీయ యోగా దినోత్సవ సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా ఈరోజు ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని యోగాసనాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...

..వాయిస్... 38 సెకన్లు

ఈ యోగా కార్యక్రమంలో ఆకాశవాణి హెడ్ ఆఫ్ ఆఫీస్ ఎమ్.సోమేశ్వరావు, సిబిసి అడిషనల్ డైరెక్టర్ జనరల్ రాజేంద్ర చౌదరి, ప్రాంతీయ వార్తావిభాగాధిపతి శ్రీసాయి వెంపాటితో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొని యోగాసనాలు వేశారు.

---------------------------

అధిక దిగుబడులు సాధించే సరికొత్త వంగడాలను సృష్టించాలని రాష్ట్ర వ్యవసాయ మంత్రి కె.అచ్చెన్నాయుడు శాస్త్రవేత్తలను కోరారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (ఆంగ్రూ) 62వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గుంటూరు సమీపంలోని లాంఫాంలో నిన్న నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఆహార భద్రత దిశగా అత్యుత్తమ సాగు రకాలు, సాంకేతికత, మేలైన వంగడాలను రూపొందించడంలో విశ్వవిద్యాలయం ఎంతగానో దోహదపడిందని కొనియాడారు. వ్యవసాయ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు క్షేత్రస్థాయిలో రైతులకు మార్గదర్శకం చేయాలని సూచించారు.

---------------------------

రాష్ట్రంలో చేపట్టిన రహదారుల అభివృద్ధిని త్వరితగతిన పూర్తి చేయాలని రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. విజయవాడలోని న్యూ డెవలప్ మెంట్ బ్యాంక్–ఎన్‌డిబి ఆధ్వర్యంలో చేపట్టిన రహదారుల అభివృది పనుల పురోగతిపై మంత్రి సంబంధిత అధికారులతో నిన్న సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వచ్చే ఏడాది చివరి నాటికి రోడ్ల అభివృద్ధి పనులను పూర్తి చేయడమే లక్ష్యంగా ఒక నిర్ధిష్ట ప్రణాళికతో సాగాలని సూచించారు. కొన్ని జిల్లాలో పనులు ఆలస్యమవుతున్నాయని ఆయా సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు.

---------------------------

ప్రమాద ఘటనల్లో గాయపడిన వారికి సకాలంలో రక్తం అందించేందుకు రక్తదానం ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రమాద ఘటనల్లో గాయపడి రక్తం అందక చనిపోయినవారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది. రక్తదానంపై సరైన అవగాహన కలిగి ఉండటం అత్యంత అవశ్యం. మూడు నెలలకోసారి రక్తదానం చేయడంతో శరీరానికి ఎన్నో ఉపయోగాలు ఉంటాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

---------------------------

కర్ణాటకలోని హెూస్కొటె వద్ద జరిగిన రహదారి ప్రమాదంలో రాష్ట్రానికి చెందిన ఆరుగురు మృతి చెందారు. చిత్తూరు నుంచి బెంగళూరుకు వెళుతున్న ఆర్టీసీ బస్సును లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందని అధికారులు తెలిపారు. ఈ ఘటనలో మృతి చెందిన వారిని చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు వాసులుగా గుర్తించామన్నారు. కాగా.. ఈ ప్రమాద ఘటనపై రవాణా శాఖ మంత్రి ఎమ్.రాంప్రసాద్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి సహాయం అందించేలా చూస్తామన్నారు.

---------------------------

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారిని ఈరోజు పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. అభిషేకసేవలోను, విఐపి విరామ సమయంలోను ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేష్ పాశ్వాన్, రాజస్థాన్ హోం మంత్రి జవహర్ సింగ్ బేధమ్, రాజస్థాన్ క్రీడా మంత్రి కె.కె.బిష్ణోయ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి వి.ఆర్.కె.కృపా సాగర్, పార్లమెంటు సభ్యులు ఎం. తంబి దురైలు వేర్వేరుగా దర్శించుకున్నారు.

---------------------------

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఉపాధి కల్పించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా అనంతపురం జిల్లాలో సుమారు 99 వేల మంది లబ్ది పొందుతున్నారు. ఉపాధి లభించడమే కాకుండా గ్రామాభివృద్ధికి ఈ పథకం దోహదపడుతోందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వాయిస్ …30 సెకన్లు

---------------------------

మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. బాపట్ల జిల్లా జె.పంగులూరు మండలం, ముప్పవరం గ్రామంలో 20 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన కచ్చా రోడ్లు , మురుగు నీటి వ్యవస్థను మంత్రి నిన్న ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, తొలి దశలో 6 కోట్ల రూపాయలతో అద్దంకి నియోజకవర్గంలో రహదారుల నిర్మాణం చేపట్టామన్నారు. మరో 7 కోట్ల 5 లక్షల రూపాయలతో రెండో దశలో రహదారుల వేయనున్నామని తెలిపారు.

---------------------------

నాణ్యమైన, పోషకాలు కలిగిన సన్న బియ్యాన్ని ఈనెల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు, సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు పంపిణీ చేస్తున్నామని కర్నూలు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారిణి నాగసుధ తెలిపారు. కర్నూలులో ఆమె ఈ రోజు మాట్లాడుతూ, సన్న బియ్యాన్ని 25 కేజీల బ్యాగుల్లో జిల్లాలోని 1434 పాఠశాలలు,160 సంక్షేమ వసతి గృహాలకు అందించామన్నారు. బియ్యం పంపిణీ విషయంలో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా క్యూర్ కోడ్ జతపరిచామని తెలిపారు.

---------------------------

చిత్తూరు జిల్లాలో ఏనుగుల నియంత్రణకు, రైతుల రక్షణకు కర్నాటక రాష్ట్రం నుండి తీసుకు వచ్చిన కుంకీ ఏనుగులను సిద్ధం చేస్తున్నామని జిల్లా అటవీ శాఖ అధికారిణి భరణి తెలిపారు. చిత్తూరులో ఈరోజు ఆమె మాట్లాడుతూ, జిల్లాలో ఏనుగుల సంచారం అధికమై పంట నష్టం, ప్రాణ నష్టం జరుగుతుండడంతో గత నెల రాష్ట్ర ప్రభుత్వం కర్నాటక నుండి నాలుగు కుంకీ ఏనుగులను పలమనేరులోని ముసలి మడుగుకు తరలించిందని చెప్పారు. ఏనుగుల సంచారాన్ని నియంత్రించడంలో పాటు, పంట నష్టం నివారణకు వీటిని సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితిపై అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎమ్. వెంకటరావు ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్...20 సెకన్లు

---------------------------

నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలంలోని బెలూం గుహలకు భౌగోళిక వారసత్వ ప్రదేశంగా జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా గుర్తింపునిచ్చింది. సుమారు 23 ఎకరాల విస్తీర్ణంలో భూమి లోపల ఏర్పడిన వీటిని క్రీస్తుపూర్వం 450 ఏళ్ల కిందట నివాస స్థలాలుగా వినియోగించినట్లు ఆధారాలు ఉన్నాయని తెలిపింది.

======================